క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం నాడు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు శుక్రవారం నిజాంపేట మండల కేంద్రంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధిగ్రస్థులకు వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మనోహరాబాద్(తూప్రాన్): స్వస్థ్ నారి సషక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మానసిక వ్యాధులకు శుక్రవారం ప్రత్యేక క్యాంపు నిర్వహించినట్లు వైద్యురాలు జ్యోత్స్న దేవి తెలిపారు. వ్యాధుగ్రస్థులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేసినట్లు తెలిపారు. చికిత్సలు అవసరమైన వారికి కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సమత, మానసిక వైద్య నిపుణురాలు దుర్గ మణి, పీహెచ్‌సీ పాల్గొన్నారు.

తల్లి పేరిట మొక్క నాటండి



నగరంలో మొక్కను నాటిన ఎంపీడీఓ రాజిరెడ్డి

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని నగరం గ్రామంలో ఎంపీడీఓ రాజిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ మేరకు ‘మ్మాకే నామ్ పర్ ఏక్ పెడ్ భాగంగా ప్రతి ఒక్కరూ నాటాలన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, హౌసింగ్ ఏఈ సంధ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమారాణి, ఉపాధ్యాయులు వెంకటేష్, కల్పన, స్రవంతి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలి

జెడ్పీ సీఈవో ఎల్లయ్య



రికార్డులు పరిశీలిస్తున్న సీఈవో ఎల్లయ్య

రామాయంపేట(మెదక్): జెడ్పీ సీఈవో ఎల్లయ్య శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పీఎం ఆవాస్ యాప్ సర్వే పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎంపీడీవో సజీరుద్దీన్, ఇతర అధికారులు ఆయన వెంట ఉన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఫుడ్ స్టాల్



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్, వైద్య సిబ్బంది

తూప్రాన్: పట్టణంలోని సీహెచ్‌సీలో గర్భిణిలకు శుక్రవారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ శివకుమారి మాట్లాడుతూ తృణధాన్యాలు, ఆకుకూరలు, గ్రామాలలో స్థానికంగా దొరికే పండ్లను ప్రదర్శించారు. వారి ప్రాముఖ్యతను గర్భవతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అమర్‌సింగ్, వైద్యులు వంశీకృష్ణ, ఆసుపత్రి సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతి ఒక్కరు ఉపాధ్యాయులను గౌరవించాలని జిల్లా రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని పాంబండ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టేషనరీ, సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

జలమయం.. ప్రయాణం నరకం

చినుకు పడితే చాలు కొన్ని గ్రామాల ప్రజలకు ప్రయాణం నరకంగా మారుతోంది. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

వర్షాలు కురిస్తే చెరువుల్లా రోడ్లు
- ఏడు గ్రామాలకు రాకపోకలు బంద్
- బ్రిడ్జిలు నిర్మించాలని విజ్ఞప్తి



రేగోడ్-మర్పల్లి రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద (ఫైల్)

రేగోడ్(మెదక్): ప్రతీ సంవత్సరం మోస్తరు వర్షాలు కురుస్తాయి. కాని ఈ సారి గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఒకపక్క పంటలన్నీ పాడై రైతులు నష్టపోయారు. మరో పక్క సుమారు మూడు మార్లు చెరువులు పొంగి అలుగులపై నీరు ఉధృతంగా ప్రవహించింది.

స్తంభించిన రాకపోకలు

భారీ వర్షాల వల్ల రేగోడ్-మర్పల్లి, పోచారం-ప్యారారం, గొట్టిముక్ల -తిమ్మాపూర్, గజ్వాడ-గట్టుపల్లి, రేగోడ్-జగిర్యాల, రేగోడ్-చౌదర్‌పల్లి, మర్పల్లి-మర్పల్లి వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే లోతట్టు రోడ్లన్నీ జలయం అయ్యాయి. రోడ్లపై ఉధృతంగా నీరు ప్రవహించిడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పొలాలకు వెళ్లిన వారు సాయంత్రం ఇంటికి చేరలేని పరిస్థితి ఏర్పడింది. వారంతా పొలాలు, ఇతర గ్రామాల్లోను చిక్కుకు పోయారు. వారిని జేసీబీ, ట్రాక్టర్, తాడు సాయంతో సురక్షితంగా చేర్చిన విషయం తెలిసిందే.

బ్రిడ్జిల నిర్మాణం ఎప్పుడు?

దశాబ్దాల కాలంగా అక్కడ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఫలితంగా వర్షం పడితే వాగులు దాటేందుకు ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

పండుగొస్తుంది.. వేతనాలు ఇవ్వరా..?

చిన్నశంకరంపేట(మెదక్): దసరా పండుగ వస్తుంది తమ పెండింగ్ వేతనాలు ఇవ్వాలని నార్సింగి మండలంలోని జప్తిశివనూర్ పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. శుక్రవారం నార్సింగి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆనంద్‌కుమార్‌ను కలిసి మూడు నెలలుగా వేతనాలు అందలేదన్నారు. కనీసం ఇప్పుడైన వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దసరా పండుగకు పిల్లలకు కొత్తబట్టలు కొనలేకపోతున్నామని వివరించారు. తమకు పెండింగ్ వేతనాలు అందించాలన్నారు. ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ మాట్లాడుతు పెండింగ్ వేతనాల విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



శివ్వంపేట: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

జీపీ కార్మికుల సమ్మె

శివ్వంపేట(నర్సాపూర్): పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తు రెండవ రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. రెండు నెలల నుంచి తమ వేతనాలు ఇవ్వడం లేదని నిర సిస్తూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. నెలవారిగా తమకు వేతనాలు ఇవ్వాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీపీ కార్మికు లు విధులు బహిష్కరించి సమ్మెకు దిగడంతో గ్రామాల్లో చెత్త సేకరణ నిలిచి పోయింది.

స్కీంవర్కర్లకు వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న మల్లేశం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం

కౌడిపల్లి(నర్సాపూర్): స్కీం వర్కర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తోపాటు ప్రతి నెల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం కౌడిపల్లిలో వివిధ రంగాల స్కీం వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీంవర్కర్ల సమస్యలు తీర్చడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్రం కార్పొరేట్ విధానాల వల్ల ఈజీఎస్, ఐకేపీ, ఐసీడీఎస్, ఎన్‌హెచ్‌ఎం, ఎండీఎం తదితర స్కీంవర్కర్లకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పింఛన్‌తోపాటు ప్రతినెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ నెల 7, 8, 9వ తేదీలలో మెదక్‌లో జరిగే సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫరీద, సుమిత్ర, బొంతమ్మ, లింగం తదితరులు పాల్గొన్నారు .

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- అడుగడుగునా గోతులు
  ప్రమాద సూచికలు
- వెలగని మెర్క్యురీ బల్బులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని హైవే అధికారులు



గుంతలకు అడ్డంగా పెట్టి సిగ్నల్ డబ్బాలు

టేక్మాల్(మెదక్): సంగారెడ్డి -నాందేడ్ అకోలా 161 హైవే అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవటంతో మున్నాళ్ల ముచ్చటగా మారింది. అడుగడుగునా గోతులు ఏర్పడి ప్రయాణికులకు ప్రాణసంకటంగా తయారయింది. రోడ్డుపై ఏర్పడిన గుంతల వద్ద ఎర్రటి జెండాలు, డబ్బాలను పెడుతున్నారే తప్పా మరమ్మతులు చేయడం లేదు. టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామ శివారును ఆనుకొని ఉన్న 161హైవేపై రెండు కిలో మీటర్ల మేర అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు పెద్దవిగా మారుతున్నాయి. గుంతల మరమ్మతులకు రోడ్డును తవ్వుతూ రోజుల తరబడి వదిలేస్తున్నారు. దీంతో దూరపు ప్రయాణికులు డబ్బాలను గమనించకపోవడంతో వాటిని గుద్దుకొని గుంతల్లో పడిపోతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది.

వెలగని మెర్క్యురీ బల్బులు

గ్రామ శివారులో ముప్పారం చౌరస్తాకు ఆనుకొని ఉన్న ఆరు మెర్క్యురీ బల్బుల స్తంభాలను ఏర్పాటు చేశారు. అర కిలో మీటర్ వరకు వెలుతురుని ఇచ్చే బల్బుల నిర్వహణ సక్రమంగా లేక అవి వెలగడం లేదు. దీంతో రోడ్డుపై చీకట్లు కమ్ముకుంటున్నాయి. రోడ్డుగుండా వెళ్లేవారు నానా ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు హైవే సిబ్బంది రోడ్డుగుండా వెళ్తున్నా సమస్యలను పరిష్కరించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వెలగని మెర్క్యురీ బల్బులు

పంటల సాగుపై సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతుల ఇంటింటికి తిరిగి పంటల సాగుపై సర్వే చేశారు. కేవీకే ఆధ్వర్యంలో తునికి గ్రామానికి ఆరుగురు యువ వ్యవసాయ శాస్త్రవేత్తలు వచ్చిన విషయం విదితమే. కాగా శుక్రవారం కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన యువ శాస్త్రవేత్తలు సందీప్ (ఆంధ్రప్రదేశ్), రణబీర్ (పశ్చిమబెంగాల్), గోపాలకృష్ణ (తమిళనాడు), లావణ్య (తెలంగాణ), రవిప్రకాష్ (ఉత్తరప్రదేశ్), రుచిత (కర్ణటక)లకు గ్రామపంచాయతీ వద్ద గ్రామసామాజిక చిత్రపటం వేసి గ్రామ వివరాలతో అవగాహన కల్పించారు. అనంతరం శాస్త్రవేత్తలు గ్రామంలో తిరిగి రైతులను పంటలసాగు, దిగుబడి, ఖర్చు, మార్కెటింగ్ తదితర విషయాలు సర్వే చేశారు.

ఉపాధ్యాయుల పాత్ర గొప్పది



పెద్దశంకరంపేటలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దశంకరంపేట(మెదక్): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని ఎంఈఓ వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు బి.శ్రీనివాస్, మారుతి, ప్రసన్నకుమార్, రాములు, ఎన్.శ్రీనివాస్, విఠల్, కుమార్, అశోక్‌రెడ్డి, విజయ, శ్రీలత సుమంగళ, బొజ్యానాయక్, ఎమ్మార్సీ సిబ్బంది సంపత్‌రెడ్డి, సంగమేశ్వర్ తదితరులున్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని మండల వైద్యాధికారి శ్రీకాంత్, గైనిక్ వైద్యురాలు ప్రేమవర్షిని తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి పీహెచ్‌సీలో ఎస్‌ఎన్‌ఎస్‌పీఏ (స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్) కార్యక్రమంలో భాగంగా సాధారణ మహిళలు, గర్భిణులకు గైనిక్ సంబంధిత వైద్యపరీక్షలు చేశారు. 60మందికి చికిత్సలు చేయగా ఒకరిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల అనుసారం పీహెచ్‌సీలో మహిళలకు ప్రత్యేక వైద్యచికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా మహిళలకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎలిజబెత్ రాణి, సూపర్‌వైజర్ రమేశ్, మౌనిక, పల్లవి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత



మాట్లాడుతున్న సంతోషిమాత

చిలప్‌చెడ్(నర్సాపూర్): సరైన పోషకాహారాలు భుజిస్తేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, మహిళల్లో రక్తహీనత లోపం ఉండదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బద్ర్యాతండా, టోప్యా తండా అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. స్థానికంగా దొరికే ఆకుకూరల స్టాల్స్ ఏర్పాటు చేసి, వాటి నుంచి లభించే పోషకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో వచ్చేనెల 16 వరకు మాసోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఎత్తు, బరువు చూసి, లోపం ఉన్న చిన్నారులకు అందించే పోషకాహారాల గురించి వివరించామన్నారు. అదేవిధంగా మహిళల్లో రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన పోషకాహారాలను తెలియజేశామన్నారు. పరిశుభ్రత, తీసుకోవాల్సి జాగ్రత్తలను తల్లులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

విజయరామరాజు సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న భూపాల్‌రెడ్డి, నాయకులు

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): దివంగత మాజీ జెడ్పీటీసీ విజయరామరాజు సేవలు చిరస్మరణీయమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మల్కాపూర్‌లో వర్ధంతి సందర్భంగా విజయరామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. మండలంలో బీఆర్‌ఎస్ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, సీనియర్ నాయకలు, సురేష్‌గౌడ్, లింగయ్య, సుభాష్, రమేష్, దత్తు, శంకర్‌గౌడ్, రవీందర్, అంజయ్య, వెంకట్‌రెడ్డి, యాదుల్, శంకరయ్య, యాఖూబ్, సాయిలు తదితరులు ఉన్నారు.

విఠల్‌రెడ్డి ఆశయాలు నెరవేరుస్తాం

గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి



మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

నర్సాపూర్: మాజీ ఎమ్మెల్యే దివంగత విఠల్‌రెడ్డి ఆశయాలు నెరవేర్చేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు ఆయన కోడలు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి చెప్పారు. శుక్రవారం స్థానిక అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల కాలేజీకి ఆమె రూ.64వేలతో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు కొనుగోలు చేసి అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విఠల్‌రెడ్డి చాలా ముందు చూపుతో గిరిజన గురుకుల కాలేజీ, పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో మొదటి సంస్థను నర్సాపూర్‌లో 1997లో ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, చిలప్‌చెడ్ మాజీ జెడ్పీటీసీ శేషాసాయిరెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.

ఆకు కూరలు ఎక్కువ తినాలి



అవగాహన కల్పిస్తున్న సంతోష

ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోష

శివ్వంపేట(నర్సాపూర్): మహిళలు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు తక్కువ ఖర్చుతో లభించే ఎక్కువ లాభాలు ఉండే ఆకుకూరలను ఆహారంలో తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోష అన్నారు. పోషణ మాసం సందర్భంగా మండల పరిధిలోని రెడ్యా తండాలో పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వంటల్లో పురుషుల భాగస్వామ్యం చేస్తూ పలు ఆకుకూరల వంటలు చేశారు. మునగాకు చపాతీ, రాగి పిండి సంకటి లాంటి వంటకాల్లో ఎక్కువ ఐరన్ ఉన్నందున అధికంగా తీసుకోవాలని సూచించారు.

తడిబట్టలతోనే ఫంగస్!


చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ సరిత



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సరిత

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం చర్మవ్యాధులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ రేఖ ఆధ్వర్యంలో చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ సరిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చర్మవ్యాధులకు తడిబట్టలు వేసుకోవడంతో దురద మొదలై ఫంగస్ మారుతోందన్నారు. ఈ సమస్య ఎక్కువగా హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఎక్కువగా ఉంటుందన్నారు. బట్టలు సరిగా ఆరబెట్టకపోవడమే కారణమన్నారు. చిన్న చిన్న జాగ్రత్తలో దురద, తామర లాంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. మరి కొందరు తెల్లని పూతతో బాధ పడుతుంటారని, ఈ వ్యాధిలో ఎలాంటి దురద కాని ఇతర సమస్యలు ఉండవని, కేవలం చూడడానికి మాత్రమే ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఇలాంటి వారికి సిద్దిపేట జిల్లా ఆస్పత్రిలో లైట్‌థెరపీ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. స్వస్థనారీ స్వశక్తి అభియన్ ప్రోగ్రామ్ ద్వారా మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రేఖ తెలిపారు. మహిళలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్ ఉన్నారు.

ప్రజలకు మరింత చేరువ కావాలి



పీసీసీ చీఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజిరెడ్డి

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

నర్సాపూర్: పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల గురించి ఆయనకు వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని పీసీసీ అధ్యక్షుడు సూచించారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి పార్టీ తరపున అవసరమైన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కాగా, పీసీసీ చీఫ్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందచేశారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో ఆయా గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు, రూ.6.15 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నేత రాజిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పాండరి, మాజీ ఎంపీపీ వినోదరెడ్డి, నాయకులు పరుశరాంరెడ్డి, విఠల్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శంకర్‌రెడ్డిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ శేరిపల్లిలో డ్రైడే

టేక్మాల్(మెదక్): మండలంలోని ఎలకుర్తి మదిర గ్రామమైన శేరిపల్లిలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వైద్య సిబ్బంది గ్రామంలో తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు ఉన్నారు.

◆ బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జీడిపల్లిలో బీజేపీ సేవా పక్షం జిల్లా కన్వీనర్ నత్తి మల్లేష్, బీజేపీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు నరేందర్‌చారి, మండల ప్రధాన కార్యదర్శి, కరాటే మల్లేష్, ఉపాధ్యక్షులు చాకలి మల్లేష్, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మురళి, నాయకులు ప్రణయ్, లింగం రమేష్, నరేష్, ప్రవీణ్, గణేష్, నాగు, స్వామి, రజనీకాంత్, కనకరాజు, వీరేష్ తదితరులున్నారు.

◆ ఎయిడ్స్‌పై అవగాహన

టేక్మాల్(మెదక్): స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శన కనకదుర్గ కళాసమితి వారు శుక్రవారం టేక్మాల్‌లో హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కళాజాత నిర్వహించారు. కళాకారులు తమ ఆటపాటలతో ఎయిడ్స్‌పై ప్రజలను చైతన్యపరిచి అవగాహన కల్పించారు. ప్రజలు ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని హెచ్‌ఐవీ వచ్చిన వారి పట్ల వివక్ష చూపకూడదని తెలిపారు. కళాకారులు భుజంగం, ఉమాపతి, కృష్ణ, చిరంజీవి, ప్రశాంతి తదితరులు ఉన్నారు.

◆ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని తునికి ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యాబోధనను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థికి చతుర్విధ ప్రక్రియలు చదవడం, రాయడం, గుణితం, కూడికలు తీసివేతలు రావాలని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్ గుప్తా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ హిందీ నేర్చుకుంటే ఎక్కడైనా బతకొచ్చు

పాపన్నపేట(మెదక్): హిందీ భాష పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉంటే దేశంలోని ఏ మూలకైనా వెళ్లి బతుకొచ్చని పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలపోటీలు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామని ఆయన పేర్కొన్నారు. మల్లంపేటకు చెందిన సాయినాథ్ విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు నింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

◆ అడ్డగోలుగా కరెంటు కోతలు

నర్సాపూర్: నర్సాపూర్‌లో అడ్డగోలుగా కరెంటు సరఫరాలో కోత విధిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్షం మూలంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వారు ఆరోపిస్తున్నారు. పట్టణంలో వేళాపాళా లేకుండా కరెంటు పోతుందని, ప్రధానంగా ఉదయం సాయంత్రం పూట కరెంటు పోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శలు వస్తున్నాయి. కరెంటుపై ఆధారపడి వ్యాపారం చేసుకునే వ్యక్తులు నష్టాల పాలవుతున్నామని, చీటికి మాటికి కరెంటు పోవడంతో కంప్యూటర్లు, కరెంటుతో పని చేసే ఇతరత్రా మిషిన్లు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో కరెంటు సరఫరాను మెరుగు పర్చాలని వినియోగదారులు అధికారులను కోరుతున్నారు.